


పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 70 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | గురువారం 12 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :70 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : ONGOLE | THU 12 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



ఏపీలో పరిశ్రమలకు పారదర్శక రాయితీలు

జపాన్ రాయబారితో సీఎం చంద్రబాబు భేటీ

- విశాఖలో చంద్రబాబు బిజీబిజీ.. జపాన్ రాయబారితో కీలక భేటీ
- ఏపీలో పారిశ్రామిక రాయితీలకు ఎస్క్రో ఖాతా విధానం
- యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు జపాన్ సుముఖత
- 2026 డిసెంబరు నాటికి శ్రీసిటీలో అమార్‌ఫస్ మెటల్ తయారీ
- విశాఖలో నూతన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు
- కాకినాడ నుంచి జపాన్‌కు భారీగా గ్రీన్ అమ్మోనియా సరఫరా



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించేందుకు పూర్తి పారదర్శకమైన రాయితీల విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పరిశ్రమలకు అందించే ప్రభుత్వ రాయితీల చెల్లింపుల కోసం ప్రత్యేకంగా 'ఎస్క్రో అకౌంట్' విధానాన్ని తీసుకొచ్చామని, రాష్ట్రంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. విశాఖపట్నంలో పర్యటించిన జపాన్ రాయబారి కెయిచీ ఓనో నేతృత్వంలోని బృందంతో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాల సరఫరా, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ వంటి పలు కీలక రంగాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అపారమైన యువశక్తి అందుబాటులో ఉందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణ అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా మారతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ ప్రక్రియలో జపాన్ సంస్థలు భాగస్వామ్యం

- మిగతా 2లో


ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు..

ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి

- రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు
- జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ
- ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



- మిగతా 2లో



ఏపీలో కొత్త పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి..

పేరు 'పీఆర్పీ'

- పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- కొత్త పార్టీ జెండాను ఆవిష్కరించిన విజయసాయి
- ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక

పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ

- మిగతా 2లో



2024తో పోలిస్తే స్థానిక పోరులో వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది

- తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాల నేతలతో జగన్ కీలక భేటీ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ
- ఎన్నికల నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం

- మిగతా 2లో



అంతర్జాతీయ సమ్మిట్‌కు ముస్తాబైన విశాఖ..

నేడు నుంచి సీఐఐ భాగస్వామ్య సదస్సు..

పెట్టుబడులే లక్ష్యంగా భారీ ఏర్పాట్లు

- విశాఖలో నేడు నుంచి 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- 58 దేశాల నుంచి హాజరుకానున్న ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు
- ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సదస్సుకు ముందే రూ.86,522 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- ఏపీ సంస్కృతి, వనరులను ప్రతిబింబించేలా భారీ ఏర్పాట్లు

పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న 31వ సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) భాగస్వామ్య సదస్సుకు విశాఖపట్నం

- మిగతా 2లో

అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

- విశాఖపట్నంలో నేడు ప్రారంభం కానున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అనివార్య కారణాలతో అమిత్ షా పర్యటన రద్దు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ - మిగతా 2లో





కొత్త రాజకీయ పార్టీతో ఏం ఒరుగుతుంది?

జెండాలు మారితే సరిపోతుందా? ప్రజల జీవితాల్లో మార్పు వచ్చేదెప్పుడు? , రెండు కుటుంబాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్న విజయసాయిరెడ్డి గత రాజకీయ ప్రస్థానంపై సమాధానం చెప్పగలరా? , యువతకు 66 శాతం అవకాశాల వాగ్దానం ఆచరణలో సాధ్యమేనా? , మరో రాజకీయ ప్రత్యామ్నాయమా.. లేక ఓట్ల సమీకరణాలను మార్చే మరో ప్రయోగమా?ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంది. మాజీ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కీలక నేత విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ' పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. విజయవాడ వేదికగా పార్టీ జెండాను ఆవిష్కరించి, రాష్ట్రంలో రెండు కుటుంబాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలుకుతామంటూ ప్రకటించారు. యువతకు పెద్దపీట వేస్తామని, కొత్త నాయకత్వాన్ని తయారు చేస్తామని, ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే ఇక్కడ సామాన్య ప్రజల మదిలో మెదులుతున్న ప్రశ్న ఒక్కటే. ఇప్పటికే ఎన్నో రాజకీయ పార్టీలను చూసిన ఆంధ్రప్రదేశ్‌కు మరో కొత్త పార్టీ రావడం వల్ల నిజంగా ఏం ఒరుగుతుంది? ప్రజాస్వామ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించడం తప్పు కాదు. రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం రావడం అవసరమే. కానీ కొత్త పార్టీ అంటే కేవలం కొత్త పేరు, కొత్త జెండా, కొత్త నినాదం మాత్రమే కాదు. ప్రజలకు భిన్నమైన పాలనా విధానాన్ని చూపించగలగాలి. ఇప్పటివరకు రాజకీయ పార్టీలు చేయలేని పనులను తాము ఎలా చేయగలమో స్పష్టంగా వివరించాలి. అంతకంటే ముఖ్యంగా గత రాజకీయ వ్యవస్థలో భాగస్వాములైన నాయకులు కొత్త పార్టీలు స్థాపించినప్పుడు తమ గత పాత్రను కూడా ప్రజల ముందు నిజాయితీగా సమీక్షించుకోవాలి.

నిన్నటి రాజకీయాల్లో భాగస్వామి.. నేటి మార్పునకు ప్రతినిధా? : విజయసాయిరెడ్డి రాజకీయాలకు కొత్త వ్యక్తి కాదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కీలక బాధ్యతలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడిగా, పార్టీ అగ్రనాయకత్వానికి సన్నిహితుడిగా, జాతీయ రాజకీయాల్లో ఆ పార్టీ వాణిని వినిపించిన నేతగా గుర్తింపు పొందారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ ఆయన రాజకీయ వ్యవస్థలో ప్రభావవంతమైన స్థానంలో కొనసాగారు. అటువంటి నాయకుడు ఇప్పుడు రాష్ట్రంలో రెండు కుటుంబాల ఆధిపత్యాన్ని అంతం చేయాలని పిలుపునివ్వడం సహజంగానే చర్చకు దారితీస్తుంది. రాజకీయ వారసత్వాన్ని ప్రశ్నించడం తప్పు కాదు. అయితే తాను గతంలో పనిచేసిన రాజకీయ వ్యవస్థలో గుర్తించిన లోపాలు ఏమిటి? వాటిని అప్పుడే ఎందుకు ప్రశ్నించలేకపోయారు? ఇప్పుడు వాటిని సరిదిద్దడానికి ప్రతిపాదిస్తున్న మార్గం ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. మరో ఆసక్తికరమైన అంశం కూడా ఉంది. 2025 జనవరిలో రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు సొంత పార్టీతో తిరిగి రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయ నిర్ణయాలను మార్చుకునే స్వేచ్ఛ ఎవరికైనా ఉంటుంది. కానీ రాజకీయాల నుంచి విరమించుకోవాలనుకున్న నాయకుడు తిరిగి పార్టీ స్థాపించాల్సిన అవసరం ఎందుకు పర్పడిందో ప్రజలకు వివరించాలి. అటువంటి వివరణ ఆయన రాజకీయ విశ్వసనీయతను నిర్ణయించే అంశాల్లో ఒకటవుతుంది. యువతకు అవకాశాలా.. రాజకీయ హామీల్లో మరో అంకమా?: పరివర్తన రాజనీతి పార్టీలో యువతకు 66 శాతం అవకాశాలు కల్పిస్తామన్న ప్రతిపాదన ఆకర్షణీయంగా కనిపిస్తోంది. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే అవకాశాలంటే ఏమిటన్నది ఇక్కడ కీలకమైన ప్రశ్న. పార్టీ సభ్యత్వంలోనా? పదవుల్లోనా? ఎన్నికల అభ్యర్థిత్వాల్లోనా? లేక పార్టీ నిర్ణయాధికారంలోనా? యువత పేరుతో సభలు నిర్వహించడం, వేదికలపై ప్రసంగాలు చేయించడం, జెండాలు పట్టించడం మాత్రమే నాయకత్వ అవకాశాలు కావు. రాజకీయ నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని కూడా యువతకు అప్పగించగలగాలి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన యువకులు, మహిళలు, సామాజికంగా అణగారిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులు రాజకీయాల్లో ఎదగడానికి మార్గం చూపాలి. అంతేకాదు, పార్టీ వ్యవస్థాపకుడి చుట్టూనే నిర్ణయాధికారం కేంద్రీకృతమైతే కొత్త పార్టీ ఏర్పడినా పాత రాజకీయ సంస్కృతి కొనసాగినట్లే. కొత్త నాయకులను తయారు చేస్తానని చెబుతున్న విజయసాయిరెడ్డి, తన పార్టీకి భవిష్యత్తులో మరొక నాయకుడు స్వతంత్రంగా నాయకత్వం వహించే అవకాశం కల్పించగలరా? అన్నది కూడా పరిశీలించాల్సిన అంశమే. ప్రజలకు కావాల్సింది పార్టీలు కాదు.. పరిష్కారాలు! : ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కొత్తవి కావు. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా వ్యయం, వైద్య ఖర్చులు, పెరుగుతున్న జీవన వ్యయం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలు ఏళ్ల తరబడి రాజకీయ చర్చల్లో వినిపిస్తూనే ఉన్నాయి. రాష్ట్ర విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా అంశం, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అభివృద్ధి, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం, రాయలసీమ సాగునీటి సమస్యలపై ప్రజలు స్పష్టమైన కార్యాచరణ కోరుతున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు తమ ప్రాధాన్యాలను ప్రకటిస్తున్నాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరో పార్టీ ఏర్పడితే ప్రజల సమస్యలకు అదనంగా ఏ పరిష్కారం లభిస్తుందన్నది ప్రధాన ప్రశ్న. రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పడం సులభమే. కానీ అందుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తారు? యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించడం సులభమే. అందుకు ఎన్ని పరిశ్రమలు అవసరం? పెట్టుబడులను ఎలా ఆకర్షిస్తారు? ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడకుండా సంక్షేమ కార్యక్రమాలను ఎలా కొనసాగిస్తారు? అనే అంశాలపై స్పష్టమైన ప్రణాళిక అవసరం. ప్రజలకు ఇప్పుడు మరో హామీల పుస్తకం అవసరం లేదు. అమలు చేయగలిగిన, ఆర్థికంగా సాధ్యమైన, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన అభివృద్ధి ప్రణాళిక అవసరం.

రెండు కుటుంబాల ఆధిపత్యం అంతమైతేనే మార్పు వచ్చినట్లా? : రాష్ట్ర రాజకీయాల్లో రెండు కుటుంబాల ఆధిపత్యం కొనసాగుతోందన్నది విజయసాయిరెడ్డి ప్రధాన విమర్శ. రాజకీయాల్లో కుటుంబ వారసత్వం, వ్యక్తి కేంద్రిత నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణపై చర్చ జరగాల్సిందే. అయితే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కేవలం రెండు కుటుంబాలకే పరిమితం చేసి చూడడం కూడా సమగ్ర విశ్లేషణ కాదు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలతోపాటు జనసేన, బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర రాజకీయ వేదికలు ఉన్నాయి. ప్రజలు తమ అభిప్రాయాలను ఎన్నికల్లో వ్యక్తం చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో కొత్త పార్టీ తన ఉనికిని చాటుకోవాలంటే ఇతర పార్టీల నాయకులను విమర్శించడం ఒక్కటే సరిపోదు. ఒక కుటుంబానికి వ్యతిరేకంగా మరో వ్యక్తి చుట్టూ రాజకీయాలను నిర్మించడం నిజమైన రాజకీయ పరివర్తన కాదు. అధికారం వ్యక్తుల నుంచి ప్రజాస్వామ్య సంస్థలకు బదిలీ కావడమే అసలైన మార్పు. పార్టీలో అంతర్గత ఎన్నికలు నిర్వహించడం, అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత పాటించడం, పార్టీ ఆదాయ వ్యయాలను వెల్లడించడం, నాయకత్వాన్ని జవాబుదారీగా ఉంచడం వంటి చర్యలు తీసుకుంటేనే కొత్త రాజకీయ సంస్కృతికి పునాది పడుతుంది. ఓట్ల చీలికకే పరిమితమవుతుందా? : కొత్త పార్టీ ఆవిర్భావంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాల్లో మార్పులు వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే ఆ ప్రభావం ఎంత ఉంటుందనేది ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుంది. విజయసాయిరెడ్డికి రాజకీయ అనుభవం, పరిచయాలు ఉన్నప్పటికీ అవి ఓట్లుగా మారుతాయన్న హామీ లేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని సంస్థాగతంగా నిర్మించడం, గ్రామస్థాయి నుంచి నాయకత్వాన్ని తీర్చిదిద్దడం, ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం సులభమైన పని కాదు. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల పట్ల అసంతృప్తిగా ఉన్న ఓటర్లు కొత్త పార్టీ వైపు మళ్లుతారా? లేక ప్రస్తుత రాజకీయ విధానాలనే కొనసాగిస్తారా? అన్నది భవిష్యత్తులో తేలాల్సిన విషయం. ఒకవేళ కొత్త పార్టీ పరిమిత ఓట్లను మాత్రమే సాధిస్తే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కానీ అది ఏ పార్టీకి లాభం, ఏ పార్టీకి నష్టం కలిగిస్తుందనేది సామాజిక, ప్రాంతీయ, రాజకీయ సమీకరణాలపై ఆధారపడి ఉంటుంది. కొత్త పార్టీ ఓట్లను చీల్చడానికే ఏర్పడిందని ముందుగానే నిర్ణయించడం సమంజసం కాదు. అదే సమయంలో తాము ఎవరికీ బీ టీమ్ కాదని ప్రకటించడం ద్వారా మాత్రమే అలాంటి అనుమానాలను తొలగించలేరు. స్వతంత్ర రాజకీయ కార్యాచరణ, విధానపరమైన స్థిరత్వం, పారదర్శక నిర్ణయాల ద్వారానే ఆ నమ్మకాన్ని కల్పించగలరు.

నినాదాల్లో పరివర్తన కాదు.. ఆచరణలో కనిపించాలి! : రాజకీయ పార్టీల పేర్లలో ప్రజాస్వామ్యం, సమానత్వం, అభివృద్ధి, సంక్షేమం, పరివర్తన వంటి పదాలు తరచూ కనిపిస్తుంటాయి. కానీ పార్టీ పేరులో ఉన్న ఆదర్శాలు ఆ పార్టీ రాజకీయ ఆచరణలో ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయన్నదే అసలైన పరీక్ష. పరివర్తన రాజనీతి పార్టీ నిజంగానే రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే ముందుగా తన సిద్ధాంతాలను, ఆర్థిక విధానాలను, పరిపాలనా నమూనాను, ప్రజలకు కల్పించే అవకాశాలను స్పష్టంగా ప్రకటించాలి. ముఖ్యంగా వివిధ జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి. నాయకుల వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కంటే ప్రజల భవిష్యత్తే ముఖ్యమన్న విశ్వాసాన్ని ఆచరణ ద్వారా కల్పించాలి. అధికార పార్టీలను విమర్శించడంతోపాటు ప్రజాప్రయోజనకరమైన నిర్ణయాలకు మద్దతు ఇవ్వగల రాజకీయ పరిపక్వతను ప్రదర్శించాలి.

చివరగా.. కొత్త పార్టీ కాదు, కొత్త రాజకీయ సంస్కృతి కావాలి! : ఆంధ్రప్రదేశ్‌కు మరో రాజకీయ పార్టీ అవసరమా, లేదా అన్నది ప్రజలే నిర్ణయిస్తారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకునే హక్కు ఉంది. విజయసాయిరెడ్డి కూడా అందుకు మినహాయింపు కాదు. అయితే కొత్త పార్టీ ఏర్పాటు చేసినంత మాత్రాన ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని భావించడం పొరపాటు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే ఎన్నో రాజకీయ నినాదాలను విన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలను చూశారు. నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలను గమనించారు. కానీ సామాన్యుడి జీవన ప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి? యువతకు స్థిరమైన ఉపాధి ఎంతవరకు లభించింది? రైతుకు గిట్టుబాటు ఎంతవరకు దక్కింది? ప్రభుత్వ సేవలు ఎంత పారదర్శకంగా మారాయి? అన్న ప్రశ్నలకు రాజకీయ వ్యవస్థ సమాధానం చెప్పాలి. విజయసాయిరెడ్డి ప్రకటించిన పరివర్తన రాజనీతి పార్టీకి కూడా ఇదే ప్రమాణం వర్తిస్తుంది. ఆయన రాజకీయ అనుభవం పార్టీ నిర్మాణానికి ఉపయోగపడవచ్చు. కానీ ఆ అనుభవమే ప్రజల విశ్వాసానికి ప్రత్యామ్నాయం కాలేదు. కొత్త జెండా ఎగురవేయడం రాజకీయ ప్రారంభానికి సంకేతం మాత్రమే. ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పును తీసుకురావడం రాజకీయ విజయానికి అసలైన కొలమానం. అందుకే విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ఆవిర్భావాన్ని స్వాగతించాలా, విమర్శించాలా అన్న చర్చకంటే, ఆ పార్టీ ప్రజలకు ఏం చేయగలదన్న చర్చ జరగాలి. పార్టీలు పెరగడం ప్రజాస్వామ్య విస్తరణకు సంకేతం కావచ్చు. కానీ ప్రజల సమస్యలకు పరిష్కారాలు పెరిగినప్పుడే అది ప్రజాస్వామ్య విజయంగా నిలుస్తుంది.చివరికి ఒకటే ప్రశ్న మిగులుతోంది. : పరివర్తన రాజనీతి పార్టీతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నిజమైన పరివర్తన వస్తుందా? లేక కొత్త పేరుతో పాత రాజకీయాలే కొనసాగుతాయా? . దీనికి సమాధానం విజయసాయిరెడ్డి ప్రసంగాల్లో కాదు.. రాబోయే రోజుల్లో ఆయన పార్టీ అనుసరించే రాజకీయ విధానంలో, ప్రజల మధ్య చేసే పనిలో కనిపించాలి.

ఆ ప్రాజెక్ట్ కి ఎమ్మార్వో "కింగ్ మేకర్" అంటా..?

- **వెళ్లిపోయిన ఎమ్మార్వోను మళ్లీ రప్పించిన అసలు కారణమేంటి?**
- **సునీల్ పునర్నియామకం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి?**
- **బదిలీ అయి వెళ్లిన అధికారిని అదే స్థానానికి తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చింది?**
- **తహసీల్దార్ కార్యాలయంలో చాపకింద నీరులా సాగుతున్న వ్యవహారాలేంటి?**
- **సునీల్‌ను తిరిగి రప్పించడం వెనుక ఏదైనా ప్రత్యేక ప్రాజెక్టు ఉందా?**
- **ఆయన కోసం అనుకున్న పని పూర్తయిందా.. లేక ఇంకా కొనసాగుతోందా?**
- **కిందిస్థాయి రెవెన్యూ సిబ్బందిలో అసంతృప్తి..**
- **తహసీల్దార్ గదిలోకి వెళ్లాలంటే మొబైల్ ఫోన్లు బయటే ఉంచాలా? ఈ నిబంధన వెనుక ఆంతర్యమేంటి?**
- **ప్రజలకు తెలియకుండా ఏం జరుగుతోంది? రాబోయే రోజుల్లో ఏం జరగబోతోంది?**
- **పునర్నియామకం వెనుక అసలు కథను వెలికితీసే దిశగా పెన్ పవర్ ప్రత్యేక కథనాలు పాఠకుల ముందుకు తెస్తుంది..!**

స్టేట్ బ్యూరో, పెన్ పవర్ తాడేపల్లిగూడెం, నవంబర్ 11:
బదిలీపై వెళ్లిపోయిన ఒక తహసీల్దార్‌ను తిరిగి అదే స్థానానికి ఎందుకు తీసుకురావాల్సి వచ్చింది? ఆయన స్థానంలో మరో అధికారిని నియమించే అవకాశం ఉన్నప్పటికీ సునీల్ కుమార్ పునర్నియామకానికి ప్రాధాన్యం ఇవ్వడానికి కారణమేంటి? ఈ నిర్ణయం కేవలం పరిపాలనా అవసరాల నేపథ్యంలో తీసుకున్నదా? లేక దీని వెనుక మరేదైనా ప్రత్యేక ప్రయోజనం ఉందా? తాడేపల్లిగూడెం రెవెన్యూ వ్యవస్థలో ఇప్పుడు సమాధానాలు కావాల్సిన ప్రశ్నలివి. తహసీల్దార్ సునీల్ కుమార్ తిరిగి బాధ్యతలు చేపట్టిన వ్యవహారంపై స్థానికంగా వినిపిస్తున్న అనుమానాలు కొత్త చర్చకు దారితీస్తున్నాయి. ఆయన పునర్నియామకం వెనుక రాజకీయ సిఫార్సులు ఉన్నాయా? ప్రత్యేకంగా ఏవైనా పనులు పూర్తి చేయించాలనే ఉద్దేశంతో తిరిగి రప్పించారా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

సునీల్‌ను తిరిగి రప్పించడం వెనుక అసలు ఉద్దేశమేంటి? : ఒక ప్రభుత్వ ఉద్యోగిని బదిలీ చేయడం, తిరిగి నియమించడం పరిపాలనా ప్రక్రియలో భాగమే. అయితే ఒకే స్థానానికి తిరిగి నియమించినప్పుడు ఆ నిర్ణయానికి దారితీసిన పరిస్థితులు ఏమిటన్నది తెలుసుకోవాలనే ఆసక్తి సహజంగానే ఉంటుంది. సునీల్ కుమార్ విషయంలోనూ ఇదే ప్రశ్న ముందుకొస్తోంది. గతంలో ఆయనను ఎందుకు బదిలీ చేశారు? తిరిగి ఏ అవసరాల దృష్ట్యా నియమించారు? ఈ నిర్ణయంలో ఎవరి సిఫార్సులు పనిచేశాయి? పునర్నియామకానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణాలేంటి? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానాలు లభిస్తేనే పునర్నియామకంపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.చాపకింద నీరులా సాగుతున్న ఆ ప్రాజెక్టు ఏంటి? : తహసీల్దార్ కార్యాలయంలో ఏదో ప్రత్యేక వ్యవహారం నిశ్శబ్దంగా కొనసాగుతోందనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది సునీల్ కుమార్‌ను తిరిగి తీసుకురావడానికి ఆ వ్యవహారమే ప్రధాన కారణమా? ఆయన రాకతో సంబంధిత పనులు వేగవంతమయ్యాయా? ఇప్పటికే ఏవైనా కీలక నిర్ణయాలు తీసుకున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఆ ప్రాజెక్టు ఏమిటి? దాని కథా కమామిషు అంతా గోపంగా జరుగుతున్నట్టు..? పెన్ పవర్ కు అందిన విశ్వసనీయ సమాచారం..!

రెవెన్యూ సిబ్బందిలో అసంతృప్తి నిజమేనా? : మరోవైపు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు గురించి కూడా పలు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులపై పని ఒత్తిడి ఉందా? అధికారుల మధ్య సమన్వయ లోపం ఏర్పడిందా? కిందిస్థాయి సిబ్బందికి తగిన గౌరవం దక్కడం లేదా? కార్యాలయ నిర్వహణలో ఏవైనా విభేదాలు తలెత్తాయా? అంటే అవుననే సమాధానం వస్తుంది, ఎమ్మార్వో ఆఫీస్ లో కిందిస్థాయి సిబ్బందికి ఎమ్మార్వోకు మధ్య పచ్చ గడ్డి వేస్తే బగ్గు మంటున్నట్టు విశ్వసనీయ సమాచారం..?

.ఎమ్మార్వో గదిలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదా? : ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన అంశం ప్రచారంలోకి వచ్చింది. తహసీల్దార్ సునీల్ కుమార్ గదిలోకి వెళ్లాలంటే మొబైల్ ఫోన్లను బయట ఉంచాల్సి వస్తోందన్న సమాచారం చర్చకు దారితీస్తోంది. అసలు అలాంటి నిబంధన అమల్లో ఉందా? ఉంటే అది కార్యాలయ సిబ్బందికే పరిమితమా? లేక ప్రజలు, ఇతర సందర్శకులకు కూడా వర్తిస్తుందా? భద్రత, గోప్యత కారణాలతో తీసుకున్న నిర్ణయమా? లేక మరేదైనా కారణం ఉందా? ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రభుత్వ కార్యాలయంలో ఇటువంటి నిబంధన అమలులో ఉంటే దానికి అధికారిక ప్రాతిపదిక ఏమిటన్నది వెల్లడించాల్సి ఉంటుంది.

పునర్నియామకంతో అనుకున్న పని పూర్తయిందా? : సునీల్ కుమార్ తిరిగి తాడేపల్లిగూడెం రావడానికి ఏదైనా ప్రత్యేకమైన కారణం ఉన్నదా అన్న ప్రశ్నకు కొనసాగింపుగా మరో సందేహం వినిపిస్తోంది. ఆయనను తీసుకురావడం వెనుక ఏదైనా నిర్దిష్ట లక్ష్యం ఉంటే, ఆ లక్ష్యం నెరవేరిందా? లేక ఇంకా ఏవైనా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నాయా? ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టిన తర్వాత రెవెన్యూ కార్యాలయంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలేంటి? గతంలో పెండింగ్‌లో ఉన్న వ్యవహారాల్లో ఏవైనా మార్పులు చోటుచేసుకున్నాయా? ఇలాంటి అంశాలపై స్పష్టత రావాలంటే బదిలీ, పునర్నియామక ఉత్తర్వులతో పాటు కార్యాలయంలో తీసుకున్న సంబంధిత అధికారిక నిర్ణయాలను పరిశీలించాల్సి ఉంటుంది.

రాజకీయ జోక్యమా.. పరిపాలనా నిర్ణయమా? : ప్రజల భూములు, రెవెన్యూ రికార్డులు, ప్రభుత్వ ధ్రువపత్రాలు, వివిధ అనుమతులు వంటి కీలక అంశాలతో ముడిపడిన తహసీల్దార్ కార్యాలయ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం ఉండటం అత్యంత అవసరం. ప్రభుత్వాధికారుల నియామకాలు పరిపాలనా అవసరాలకు అనుగుణంగా జరగాలి. రాజకీయ సిఫార్సులు ఉన్నాయనే విశ్వసనీయ ప్రచారం ఉంది ..! నీల్ కుమార్ పునర్నియామకం వెనుక ఉన్న వాస్తవ కారణాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికార యంత్రాంగంపైనే ఉంది...!

అసలు కథ ఇంకా మిగిలే ఉందా? : తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వినిపిస్తున్న ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభించే వరకు చర్చ కొనసాగుతూనే ఉండే అవకాశం ఉంది. సునీల్ కుమార్‌ను తిరిగి రప్పించడానికి బలమైన కారణం ఏమిటి? ఆయన పునర్నియామకంలో ఎవరి పాత్ర ఎంత? కార్యాలయంలో ప్రత్యేకంగా ఏమైనా పనులు జరుగుతున్నాయా? కిందిస్థాయి ఉద్యోగుల అసంతృప్తి వాస్తవమేనా? మొబైల్ ఫోన్లపై ఆంక్షల ప్రచారంలో నిజమెంత?

ఇవన్నీ ఆధారాలతో పరిశీలించాల్సిన అంశాలే. : ఈ ఆరోపణలు, అనుమానాలపై తహసీల్దార్ సునీల్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారుల వివరణ కూడా అత్యంత కీలకం. వారి అధికారిక స్పందన, అందుబాటులోకి వచ్చే పత్రాలు, ఉద్యోగ సంఘాల అభిప్రాయాల ఆధారంగానే వాస్తవ పరిస్థితి వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత ఉండాలన్నదే ప్రధాన అంశం. ఎవరి నియామకం వెనుక ఏ కారణం ఉన్నా, అది చట్టబద్ధంగా, ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా జరిగిందా లేదా అన్నదే కీలక ప్రశ్న.

ఎపిసోడ్--3 లో
ఎమ్మార్వో గదిలోకి వెళ్లాలంటే మొబైల్ బయట పెట్టాల్సిందేనా?
తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగుల మధ్య ఏం జరుగుతోంది?
సునీల్ తిరిగి రావడం వెనుక ప్రచారంలో ఉన్న ప్రత్యేక పని ఏమిటి?
రెవెన్యూ ఉద్యోగుల ఆందోళన ప్రచారం వెనుక అసలు వాస్తవాలేంటి?

ఏపీలో పరిశ్రమలకు పారదర్శక రాయితీలు

- మొదటి పేజీ తరువాయి

కావాలని కోరారు. ఇందుకు జపాన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.కీలక ఖనిజాలైన 'రేర్ ఎర్త్ మినరల్స్'ను జపాన్‌కు నిరంతరాయంగా సరఫరా చేసే అంశంపైనా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సహకారం భారత్-జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని జపాన్ రాయబార బృందం అభిప్రాయపడింది. అలాగే ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ఉక్కు ప్లాంట్‌కు సంబంధించి, తుది దశ ప్రాసెసింగ్ కోసం అవసరమైన సెమీ ఫినిష్డ్ ఉత్పత్తులను జపాన్‌లోని మాతృసంస్థ నుంచి దిగుమతి చేసుకునే ప్రక్రియకు ప్రభుత్వం తగిన తోడ్పాటు అందించాలని కోరారు. మరోవైపు విద్యుత్ పంపిణీలో అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల తయారీకి ఉపయోగించే 'అమార్ఫస్ మెటల్'ను దేశంలోనే తొలిసారిగా ఉత్పత్తి చేయాలని ప్రొటీరియల్ ఇండియా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాల సహకారంతో 2026 డిసెంబరు నాటికి

శ్రీసిటీలో ఈ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రతినిధులు వివరించారు.
భారతీయ నిపుణుల ప్రతిభను అంతర్జాతీయ అవసరాలకు వినియోగించుకునే దిశగా విశాఖపట్నంలో భారత్-జపాన్ సహకారంతో కొత్తగా 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్' (జీసీసీ) ఏర్పాటు చేసినట్లు జపాన్ ప్రతినిధులు తెలిపారు. దీనితో పాటు హరిత ఇంధన రంగంలో కీలక ముందడుగు పడింది. కాకినాడ నుంచి ఏటా సుమారు 70 వేల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఐదేళ్ల పాటు కొనుగోలు చేసేందుకు జపాన్‌కు చెందిన ప్రముఖ విద్యుత్ దిగ్గజం 'జెరా', ఏపీకి చెందిన 'ఏఎం గ్రీన్' సంస్థతో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య పటిష్టమైన గ్రీన్ అమ్మోనియా సరఫరా వ్యవస్థ నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఇరు వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి.

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు..
ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి

గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట

రైతుకు నష్టం జరగకుండా చూడాలి

పూర్తి స్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ జరగాలి

రహదారుల మరమత్తులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

అధికారులకు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి దిశ నిర్దేశం





సంతమాగులూరు, పెన్ పవర్ నవంబర్ 11

మురసు తుపానుతో నష్టపోయిన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తుపాను ప్రభావం, విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టం, వ్యవసాయ, ఉద్యాన పంటలు, రహదారుల పరిస్థితిపై సంతమాగలూరు మండలం పుట్టావారిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సమీక్ష నిర్వహించారు. తుపానుతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనుల పురోగతిని మంత్రి గొట్టిపాటి అడిగి తెలుసుకున్నారు. గృహ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ దాదాపు పూర్తయిందని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులను మరింత వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ సరఫరా లేక సాగునీరు అందక ఏ ఒక్క రైతు పంట కూడా దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

నష్టంపై సమగ్ర అంచనాలతోనే పరిహారం.....

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మురసు తుపానుతో జరిగిన వ్యవసాయ పంటల నష్టాన్ని పంటల వారీగా అంచనా వేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. వరి, పత్తి, మిరప, మినుము, శనగ, పొగాకు తదితర పంటలకు జరిగిన నష్టాన్ని గుర్తించడంతోపాటు.. దెబ్బతిన్న విస్తీర్ణం, నష్టపోయిన రైతులందరి వివరాలను నమోదు చేయాలన్నారు. కోత దశలో ఉన్న పంటలు, నేలకొరిగిన పంటలు, నీట మునిగిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ నష్టం వివరాలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని కూడా సమగ్రంగా అంచనా వేయాలన్నారు. దెబ్బతిన్న తోటలు, పంటల విస్తీర్ణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చే ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం నుంచి సత్వర సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు రైతులకు త్వరితగతిన అందేలా సమగ్ర నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని ఆయన ఆదేశించారు.

రోడ్ల మరమ్మతులు వేగవంతం చేయాలి.....

మురసు తుపానుతో అద్దంకి నియోజకవర్గంలో దెబ్బతిన్న ప్రధాన రహదారులు, గ్రామీణ అంతర్గత రోడ్ల పరిస్థితిని ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్షించారు. రహదారుల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ ప్రయాణాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా రహదారుల పునరుద్ధరణ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కృషి చేయాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.

ఎంపీటీసీ విజేతలకు అభినందనలు....

అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీలుగా విజయం సాధించిన పలువురు అభ్యర్థులు సంతమాగలూరు మండలంలోని పుట్టావారిపాలెం క్యాంప్ కార్యాలయంలో బుధవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన అభ్యర్థులను మంత్రి అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీటీసీలకు మంత్రి గొట్టిపాటి దిశానిర్దేశం చేశారు.

పెన్ పవర్

మార్కాపురం - ప్రకాశం

జిల్లా జడ్పీ చైర్మన్ పీఠంపై రెబ్బవరపు మాల్యాద్రి ఆశలు!

-సామాజిక సమీకరణాలు కలిసొస్తే అవకాశం దక్కేనా?

-మాల్యాద్రి, కోరుకొండ అంజిబాబు పేర్లపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ



కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11:

తెలుగుదేశం పార్టీ తరఫున కందుకూరు జడ్పీటీసీగా ఘన విజయం సాధించిన రెబ్బవరపు మాల్యాద్రి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి తన విజయానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.

సామాజిక సమీకరణాలే కీలకం!

ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందన్న అంశంపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ కింద కేటాయించిన ఐదు జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల్లో ఇప్పటికే మూడు జిల్లాల్లో మాల సామాజిక వర్గానికి అవకాశం కల్పించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

మాల్యాద్రికి కలిసొచ్చేనా సామాజిక సమీకరణాలు?

ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్ పదవి మాదిగ సామాజిక వర్గానికి కేటాయిస్తే కందుకూరు జడ్పీటీసీ రెబ్బవరపు మాల్యాద్రికి అవకాశం దక్కవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే పదవి మాల సామాజిక వర్గానికి కేటాయిస్తే వలేటివారిపాలెం జడ్పీటీసీ కోరుకొండ అంజిబాబుకు అవకాశం లభించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఎంపికలో సామాజిక సమీకరణాలు, పార్టీ అధిష్ఠానం నిర్ణయం కీలకం కానున్నాయి. మాల్యాద్రిని అదృష్టం వరిస్తుందా? అంజిబాబుకు అవకాశం దక్కుతుందా? అన్నది తేలాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే!.

శ్రీ వాసవిమాతకు సారె సమర్పణ

యమద్వితీయ (భగిని హస్త భోజనం) వేడుకలు





ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 11

యమద్వితీయ పండుగను పురస్కరించుకుని బుధవారం ఒంగోలు గాంధీ రోడ్ లోని గీతా మందిర భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక అమలనాథుని వీధిలో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారికి ఘనంగా సారె సమర్పించారు. ఆర్యవైశ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే ఈ అన్నాచెల్లెళ్ల పండుగను పురస్కరించి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ముందుగా గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గీతా శ్లోకాలను పఠించారు. అనంతరం అక్కడి నుంచి గాంధీ రోడ్డు, దక్షిణం బజారు, పప్పు బజార్ మీదుగా భక్త బృందం వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి చేరుకున్నారు. అమ్మవారికి చీర, సారె, పసుపు-కుంకుమలు, గాజులు, పండ్లను భక్తిపూర్వకంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర సహస్రనామార్చన, మంత్రపుష్పం, మహా హారతి నిర్వహించారు. తదుపరి సామూహికంగా విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ స్తోత్రాలను పఠించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గీతా మందిర భక్త బృందం సభ్యులు దోగివర్తి సుబ్రమణ్యం, రాజరాజేశ్వరి, కే. కృష్ణ, కొప్పురావూరి సురేఖ, దేసు అరుణ, ఉపేంద్ర, అనిత, చీమకుర్తి శివప్రసాద్, భారతి, గుర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు తావివ్వొద్దు..!

ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించాలి

క్షేత్రస్థాయిలో డ్వామా పీడీ సువార్త ఆకస్మిక తనిఖీ..

పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 11

వి.బి.జి. రామ్ జీ అమలులో నిర్లక్ష్యానికి, అవకతవకలకు తావులేకుండా విధులు నిర్వహించాలని మార్కాపురం జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్. సువార్త సిబ్బందికి స్పష్టం చేశారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి 125 రోజుల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని, కూలీలకు వేతనాలు సకాలంలో అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామ పంచాయతీలో జరుగుతున్న వి.బి.జి. రామ్ జీ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పని ప్రదేశాల్లో కూలీలతో నేరుగా మాట్లాడి వేతనాలు సకాలంలో అందుతున్నాయా? పని ప్రదేశంలో ప్రథమ చికిత్సకు అవసరమైన మెడికల్ కిట్ అందుబాటులో ఉందా? తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఉపాధి పనులకు వచ్చే కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా అవకతవకలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.అవినీతికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో వి.బి.జి. రామ్ జీ సిబ్బందితో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.గ్రామాల వారీగా ఉపాధి పనుల పురోగతి, కూలీల హాజరు, పని దినాల కల్పన, సిబ్బంది పనితీరుపై సమగ్రంగా సమీక్షించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై ఆరా..

గత మూడు నెలలుగా గ్రామాల వారీగా వేతనదారుల హాజరు, నిర్దేశించిన లక్ష్యాల సాధన, పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. తక్కువ ప్రగతి నమోదు చేసిన





క్షేత్ర సహాయకులను తీవ్రంగా హెచ్చరిస్తూ పనితీరును మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కూలీలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పనుల కొలతల పై కూలీలకు అవగాహన కల్పించాలి..: సాంకేతిక సహాయకులు ప్రతిరోజూ పనులు జరిగే ప్రదేశాలను సందర్శించి పనుల నాణ్యతను, కొలతలను పరిశీలించాలని పీడీ ఆదేశించారు. కూలీలు చేపట్టే పనులకు సంబంధించి కొలతల విధానంపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. పనుల్లో పారదర్శకత పాటిస్తూ నిబంధనల ప్రకారం కొలతలు నమోదు చేయాలని స్పష్టం చేశారు.రోజువారీ విధులకు ప్రత్యేక కార్యాచరణ ఏపీవో, ఈసీతో పాటు సంబంధిత సిబ్బంది ప్రతిరోజూ ఉదయం పనులు జరిగే ప్రదేశాలను పరిశీలించాలని, సాయంత్రం వేళల్లో వేతనదారులను సమీకరించి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన పర్యటనలు, పనులకు సంబంధించిన ఫొటోలను ప్రతిరోజూ అధికారిక వాట్సాప్ గ్రూపులో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

గిరిజన తండాలపై ప్రత్యేక దృష్టి..

ఐటీడీఏ పరిధిలోని గిరిజన తండాల్లో ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పీడీ సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి కుటుంబానికి 125 రోజుల పని దినాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని, ఉపాధి పనులపై వారికి అవగాహన కల్పించి పనుల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో వాక్యవతి, ఈసీ ఎన్.వి. శివ, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్లూరుపాడులో కేవీకే శాస్త్రవేత్తల బృందం పర్యటన

–మిరప పంట సాగు, తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

–పాడి, గొర్రెల పెంపకంపై రైతులకు పలు సూచనలు

కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11:

కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తల బృందం ఎడ్లూరుపాడు గ్రామంలో పర్యటించి రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల యాజమాన్యం, పశుపోషణపై పలు సూచనలు అందజేశారు. ఈ పర్యటనలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు రైతులతో సమావేశమై కృషి విజ్ఞాన కేంద్రం అభివృద్ధి చేసిన నూతన రకం మిరప వంగడాలు, వివిధ తెగుళ్లను తట్టుకునే వాటి లక్షణాల గురించి వివరించారు.

మిరప నారు మడుల పరిశీలన

గ్రామంలోని మిరప నారు మడులను పరిశీలించిన శాస్త్రవేత్తలు నారు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ చర్యలు, ఆరోగ్యకరమైన నారు ఉత్పత్తికి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు విలువైన సూచనలు అందించారు.

అలాగే ఎడ్లూరుపాడు--వెంకటాద్రిపాలెం మధ్య రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి వాటి ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలపై మన రైతన్న ఫౌండేషన్ సభ్యులకు ముఖ్యమైన సమాచారాన్ని అందించారు.

డైరీ, గొర్రెల ఫారాల సందర్శన

పర్యటనలో భాగంగా గ్రామంలోని డైరీ ఫారమ్‌తో పాటు





గొర్రెల ఫారమ్‌ను కూడా శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. పాడి పశువుల పోషణ, ఆరోగ్య పరిరక్షణ, గొర్రెల పెంపకంలో పాటించాల్సిన మెళకువలు, లాభదాయకమైన పశుపోషణ విధానాలపై రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు.

శాస్త్రవేత్తలకు రైతన్న ఫౌండేషన్ సభ్యుల సహకారం

ఈ కార్యక్రమానికి కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు. శాస్త్రవేత్త వెంకటేష్‌తో పాటు మన రైతన్న ఫౌండేషన్ సభ్యులు బాశం కోటేశ్వరరావు, పొన్నగంటి సురేష్, ద్రోణాదుల వెంకటనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కందుకూరు ప్రభుత్వాసుపత్రిలో ఒకేరోజు 11 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

- పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

–ప్రభుత్వాసుపత్రిలో విస్తరిస్తున్న వైద్య సదుపాయాలు - ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా సేవలు

కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11

కందుకూరు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఒకేరోజు 11 కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఒంగోలు నుంచి విచ్చేసిన జిల్లా ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఒంగోలు ఎం.సి.హెచ్. వైద్యులు డాక్టర్ రాజేష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. వివిధ మండలాలకు చెందిన 11 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు.

ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్యం...

ఈ సందర్భంగా కందుకూరు ఏరియా ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలను నిరంతరం అభివృద్ధి చేస్తూ పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన



వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు భరించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వాసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలతో పాటు ఇతర వైద్య సేవలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు.

వైద్య సేవల విస్తరణకు ప్రత్యేక చర్యలు...

ఒకేరోజు 11 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించడం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలకు, వైద్య బృందం నిబద్ధతకు నిదర్శనమని డాక్టర్ ఇంద్రాణి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య సేవలను విస్తరించి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కందుకూరు ఏరియా ప్రభుత్వాసుపత్రి కృషి చేస్తుందని ఆమె వెల్లడించారు.

ఈనెల 14 న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

- కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుచిత్ర వీరయ్య చౌదరి



ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ నవంబర్ 11

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఒంగోలు నందు వారోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్

సుచిత్ర వీరయ్య చౌదరి..

ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. కుమార్ రాజా మాట్లాడుతూ, నవంబర్ 14 నుండి 20వ తేదీ వరకు వారం రోజులపాటు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, బాలబాలికలు, పాఠకులలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి సృజనాత్మకత, విజ్ఞానాభివృద్ధిని ప్రోత్సహించే విధంగా వివిధ సాంస్కృతిక, సాహిత్య, వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వికార్యక్రమాల వివరాలులి :

నవంబర్ 14 (శనివారం): వారోత్సవాల ప్రారంభోత్సవం, పాటల పోటీలు (దేశభక్తి/జానపద గీతాలు), ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు. నవంబర్ 15 (ఆదివారం): స్టాండ్ అప్ టాలెంట్ షో, క్విజ్ పోటీలు.

నవంబర్ 16 (సోమవారం): వక్తృత్వ పోటీలు. నవంబర్ 17 (మంగళవారం): డాన్స్ పోటీలు (శాస్త్రీయ/జానపద నృత్యాలు). నవంబర్ 18 (బుధవారం): వ్యాసరచన పోటీలు, పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలపై కార్యక్రమాలు. నవంబర్ 19 (గురువారం): ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు. నవంబర్ 20 (శుక్రవారం): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతుల ప్రదానం. ఈ కార్యక్రమాలన్నీ జిల్లా కేంద్ర గ్రంథాలయం, ఒంగోలు నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను జూనియర్.. సీనియర్ విభాగాలుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, పాఠకులు, గ్రంథాలయ అభిమానులు ఈ వారోత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బి. కోటేశ్వరి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎం. శ్రీనివాసులు, కె. సంపూర్ణమ్మ, డి. సందీప్, ఎస్. అనిల్ బాబు, ఎం. శివకుమారి, కార్యాలయ సిబ్బంది జి. శాంసన్, కె. కృష్ణవేణి, వై. మృదుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 31 లోపు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలి

- సీసీఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ నవంబర్ 11

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని, రీ-సర్వే అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి పరిశీలన (గ్రౌండ్ ట్రూతింగ్) పనులను వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ లోపు అత్యంత ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి స్పష్టం చేశారు. బుధవారం ఉదయం భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సిసిఎల్ఏ) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఒంగోలులోని తన క్యాంపు కార్యాలయం నుండి ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ జి. జయలక్ష్మి మాట్లాడుతూ, అదేవిధంగా, వెబ్‌ల్యాండ్ పోర్టింగ్ ప్రక్రియలో ఎటువంటి సాంకేతిక లోపాలు



తలెత్తకుండా జాగ్రత్త వహించాలని, రైతుల భూ రికార్డులకు సంబంధించి ఈ-కేవైసీ, ఆధార్ సీడింగ్ ప్రక్రియను ఎక్కడా పెండింగ్ లేకుండా తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్తీక మాసంలో లలితా అమ్మవారి పూజ, హోమం, ప్రవచనం





బ్యూరో పెన్ పవర్, ప్రకాశం నవంబర్ 11:

జిల్లా కేంద్రమైన ఒంగోలు పట్టణంలోని భాగ్యనగర్ లలితా ధ్యాన మండలి బృందం ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం తోటా శ్రీనివాసరావు నివాసంలో లలితా అమ్మవారి పూజ, లలితా హోమం, లలితా ప్రవచనం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కురుగంటి శ్యామలాదేవి ఆశీస్సులతో, గురువు కోట అరుణ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లలితా హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన లలితా ప్రవచనంలో గురువు కోట అరుణ రాజ్యలక్ష్మి భక్తులకు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది భక్తులు పాల్గొని పూజలు, హోమంలో భక్తితో భాగస్వాములయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం ముత్తైదువులకు పండు, తాంబూలం అందజేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తోటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భాగ్యనగర్ లలితా ధ్యాన మండలి సభ్యులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పలుకూరులో కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్న దివి బ్రదర్స్





కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11

మండలంలోని పలుకూరు గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించుకున్న కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమంలో కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం , దివి సౌభాగ్య , తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరాం , రవీంద్రనాథ్ గ్రామంలోని ప్రజలతో మమేకమై ఆప్యాయంగా అందరినీ పలకరించిన విధానం సామాన్య ప్రజలను సైతం ఆకట్టుకుంది. అతిథులుగా హాజరైన దివి శివరాం , సౌభాగ్య , దివి రవీంద్రనాథ్ ను కందుకూరు మండలం ఎంపిపి నార్నె రాధ , గ్రామ పెద్దలు నార్నె రోశయ్య , ఈదర రమేష్ తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

కుందుర్రు, పరిటాలవారిపాలెం పొలం పిలుస్తోంది కార్యక్రమం

సంతమాగులూరు, పెన్ పవర్, నవంబర్ 11

ఈ రోజు సంతమగులూరు మండలంలోని కుందుర్రు, పరిటాలవారిపాలెం రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు పలు ముఖ్యమైన వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా పంటల బీమా (క్రాఫ్ ఇన్సూరెన్స్) చేయించుకోవాలని సూచించారు. ఏపీఏఐఎంఎస్ విధానం ద్వారా రైతులు ఎరువులు పొందే విధానాన్ని వివరించారు. రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చైతన్య , వీఏఏ అజయ్ మరియు వీహెచ్ఏ పరమేశ్వరి ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ

100 మంది పేద మైనారిటీ విద్యార్థులకు గొప్ప అవకాశం




ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ నవంబర్ 11

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 100 మంది పేద మైనారిటీ విద్యార్థులకు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. కంప్యూటర్ విద్యారంగంలో 32 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన తమ సంస్థ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై మార్గదర్శకత్వం కూడా అందించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు అర్హులైన ఆసక్తిగల మైనారిటీ విద్యార్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రతులతో ఈ నెల 15వ తేదీలోపు ఒంగోలులోని అంజయ్య రోడ్డులో ఉన్న బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ బ్రాంచ్‌ను సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.ల

సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాయవరంలో పోలీసుల పర్యటన

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు - సీఐ



మార్కాపురం పెన్ పవర్, నవంబర్ 11

త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో మార్కాపురం సీఐ, రూరల్ ఎస్ఐ బుధవారం మండలంలోని రాయవరం గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు, ఎన్నికల ఏర్పాట్లు, శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబోయే ప్రాంతాలను పరిశీలించి, అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. గ్రామస్తులతో మాట్లాడిన సీఐ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని కోరారు. ఎవరైనా ఓటర్లను బెదిరించినా, డబ్బు, మద్యం పంపిణీకి పాల్పడినా, గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామంలో గతంలో సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రౌడీషీటర్లు, సమస్య సృష్టించే వారిపై ముందస్తుగా నిఘా ఉంచుతామని చెప్పారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎలాంటి భయం లేకుండా పోలింగ్‌కు రావాలని పోలీసులు గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులు మౌలానా అబుల్ కలాం ఆజాద్

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సంధర్భంగా ఘన నివాళులు











ఒంగోలు టౌన్, పెన్ పవర్ నవంబర్ 11

భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముస్లిం ప్రజా సంఘాల నాయకులు పలువురు ఆయన విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..

మౌలానా అబుల్ కాలం ఆజాద్ జయంతి సందర్భముగా ' మైనారిటీల సంక్షేమ దినోత్సవం.. జాతీయ విద్యా దినోత్సవం ' ను నగరంలోని ఆయన విగ్రహం వద్ద ఘనం గా నిర్వహించారు. ముందుగా

మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం భవనంలోని జిల్లా కలెక్టర్ వి.సి.హాలు నందు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవిన్యూ అధికారి వెంకట రమణ, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఎం. రజనీ కుమారి, జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ ఫైజుద్దీన్, డిఎండబ్ల్యూఓ సూపరింటెండెంట్ సుధాకర్, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ సాదిక్ లు మదరసా ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూల మాలాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి, వారి యొక్క విద్యాభ్యాసం గురించి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో...

బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) యన్.యుగంధర్ బాబు పోలీస్ అధికారులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారు గొప్ప విద్యావేత్త, కవి, స్వాతంత్ర్య సమరయోధుడని, స్వతంత్ర భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించారని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో, విద్యారంగం బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరనీయమని, భారత రత్న అవార్డుతో సత్కరించబడ్డారని కొనియాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు "మొహియుద్దీన్ అహ్మద్"అని, 'అబుల్ కలాం' అనేది అతని బిరుదని, 'ఆజాద్' అనేది తన కలం పేరని, అతను బహుభాషా పండితులని, అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ మొదలగు అనేక భాషలలో ప్రావీణ్యులని, భారత ప్రభుత్వంలో విద్యాశాఖామంత్రి గా పనిచేసారని, ఆయన పుట్టినరోజును "జాతీయ విద్యా దినోత్సవంగా" జరుపుకుంటున్నామని తెలిపారు. హిందూ, ముస్లింల ఐక్యతను పెంపొందించటానికి విశేష కృషిచేసిన ఆ మహనీయున్ని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ కోరారు. జయంతి సందర్భంగా సిబ్బందికి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ రమణ రెడ్డి, ఆర్ఎస్సై లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో

స్థానిక పాత కూరగాయల మార్కెట్ వద్ద సెయింట్ థెరిస్సా స్కూల్ ఎదురుగా గల మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ గా నూతనంగా ఎన్నికైన షేక్ అల్లా బక్షు ఆధ్వర్యంలో రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ నాయకులు షేక్ కఫిల్ బాషా, పఠాన్ హనీఫ్ ఖాన్, షేక్ అమరుల్లా, షేక్ శిలార్, షేక్ మస్తాన్ (బాబా), షేక్ సైదా,షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్ వలీ, షేక్ కరీముల్లా, షేక్ సాదిక్, షేక్ రహీం తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారతదేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో

ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, జిల్లా ఉపాధ్యక్షులు పఠాన్ సాజిద్ ఖాన్, పట్టణ కార్యదర్శి షేక్ నిసార్, షేక్ బాషా, షేక్ నాగూర్, పాల్గొన్నారు.

ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా విద్యాభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత



మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 11:

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు మార్కాపురం కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి.కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధికారులు, సిబ్బంది కూడా పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వతంత్ర భారత విద్యావ్యవస్థ నిర్మాణంలో మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు, నాణ్యమైన విద్య అందరికీ చేరువ చేయడానికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు.ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, నేటి యువత ఆజాద్ చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎం. శ్రీదేవి, జెడ్పీ సీఈవో జోసఫ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక ప్రవచనం



ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 11

అత్యంత విశిష్టమైనది, శివ కేశవలకు ప్రియమైనది, ధార్మిక ఆచరణకు అనువైన సమయము కార్తీక మాసము అని.... ఒంగోలుకు చెందిన ప్రవాచకులు నెమ్మాని సీతారామమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆయన శ్రీశైల మహా క్షేత్రంలోని... ధర్మపథం వేదికపై.. కార్తీక మాస వైభవం గురించి ప్రసంగించారు. దీపారాధనలు, లింగాభిషేకాలు, బిల్వ దళార్చన,వనభోజనాలు, నాగుల చవితి, భగినీ హస్తభోజనం, జ్వాలా తోరణం, కార్తీక పౌర్ణమి, పోలి స్వర్గం మొదలైన అంశాల గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో,ఎంపి ఆర్వో గణేష్ తదితరులు ఆయనను సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరపాలి



ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ నవంబర్ 11

స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అన్నారు.బుధవారం యర్రగొండపాలెం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో అధికార కూటమి అక్రమాలకు పాల్పడి, ఎన్నికలలో పోటీ చేయు వారిని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికలు జరిపించారని,అధికార యంత్రాంగం, పోలీసులు వన్ సైడ్ చేశారని అన్నారు.నామినేషన్ పత్రాలను చించి వేయటం, పోలింగ్ బూతులను ఆక్రమించడం, ఎన్నిక అయిన వారికి డిక్లరేషన్ పత్రాలు ఇవ్వకపోవడం, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఈ సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను సజావుగా జరిపి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు.ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ నాయకులు పి.తిరుమలయ్య, మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి శివాలయంలో సీఐ రాజేష్ కుమార్ ప్రత్యేక పూజలు

పొదిలి, పెన్ పవర్, నవంబర్ 11

పొదిలి పట్టణంలోని ప్రసిద్ధ నిర్మ మహేశ్వర స్వామి ఆలయంలో పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజేష్ కుమార్ ప్రత్యేక పూజలు జరిపారు. పవిత్ర కార్తీక మాసాన్ని పునస్కరించుకుని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న నిర్మ మహేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన బుధవారం నాడు సందర్శించారు. అలాగే పార్వతీ సమేత నిర్మామహేశ్వర స్వామికి ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ కుమార్ ను దేవస్థానం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య శాలువా , పూలదండతో సత్కరించి, ఆలయ ప్రసాదాన్ని అందించడంతోపాటు ప్రత్యేకంగా స్వామివారి దర్శనాన్ని కల్పించారు.



ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యం

ఆటో డ్రైవర్లకు పోలీసుల కౌన్సెలింగ్ -నిబంధనలు పాటించాలని సూచన

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటోలు నిలపాలి -సీఐ ఎం.డి. అల్తాఫ్ హుస్సేన్

మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 11:

ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఆటో డ్రైవర్లందరూ పోలీసులకు సహకరిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ ఎం.డి. అల్తాఫ్ హుస్సేన్ కోరారు.స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో బుధవారం మార్కాపురం పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లందరికీ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు మరియు ప్రయాణికుల సురక్షిత ప్రయాణంపై అవగాహన కల్పించేందుకు కౌన్సెలింగ్ కార్యక్రమం ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఆటోలను రోడ్డుకు మధ్యలో నిలపకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు మార్జిన్‌లోనే నిలపాలని, ప్రయాణికులను ఎక్కించే సమయంలో, దించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉంటూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లు వెంటనే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, లైసెన్స్ పొందేందుకు పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలియజేశారు.ఆటో డ్రైవర్లలోనే ఎనిమిది మందిని వాలంటీర్లుగా ఎంపిక చేసి, ఆయా ఆటో స్టాండ్లలో ఆటోలను క్రమపద్ధతిలో నిలిపేలా, ట్రాఫిక్‌కు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ హరూన్ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు నేటి తరానికి స్ఫూర్తి

జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



మార్కాపురం, పెన్ పవర్ నవంబర్ 11

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన దేశభక్తి, విద్యారంగానికి చేసిన సేవలు, జాతీయ సమైక్యత కోసం చూపిన చిత్తశుద్ధి నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.విద్య లేకుండా ఏ దేశం అభివృద్ధి చెందదని నమ్మిన ఆజాద్, దేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారని ఎస్పీ గుర్తు చేశారు. ఆయన ఆశయాలను నేటి యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మురుసు తుఫాను ప్రభావంతో జిల్లాలో విద్యుత్ శాఖకు అపార నష్టం

- యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ - విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ నవంబర్ 11

మురుసు తుఫాను ప్రభావంతో ప్రకాశం జిల్లాలో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తుఫాను కారణంగా జిల్లావ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ శాఖకు సుమారు రూ.20 కోట్ల మేర నష్టం సంభవించిందని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గత వారం రోజులుగా రాత్రింబవళ్లు నిరంతరంగా శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టడ జరిగిందని తెలిపారు. ముఖ్యంగా గృహ విద్యుత్ వినియోగదారులకు సంబంధించిన విద్యుత్ సరఫరాను 100 శాతం పునరుద్ధరించడం జరిగిందని, ప్రస్తుతం ఆక్వా, ఇండస్ట్రియల్ , వ్యవసాయ విద్యుత్ సర్వీసుల పునరుద్ధరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సిఎం, డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి, ఉన్నతాధికారుల సూచనలతో అదనపు విద్యుత్ సిబ్బంది బృందాలను రంగంలోకి దించడం జరిగిందని



తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 400 మంది, తమిళనాడు రాష్ట్రం నుంచి 300 మంది, అలాగే విజయవాడ, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి స్థానిక విద్యుత్ సిబ్బంది బృందాలు విద్యుత్ పునరుద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నారని తెలిపారు. మొత్తం సుమారు 1,400 మంది విద్యుత్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. అలాగే డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) గత 4 రోజులుగా నాగులుప్పలాడులోనే ఉండి పునరుద్ధరణ పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని, ప్రకృతి వైపరీత్యం కారణంగా ఏర్పడిన ఈ అసాధారణ పరిస్థితులను ప్రజలందరూ అర్థం చేసుకుని విద్యుత్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని తెలిపారు. మిగిలిన ఆక్వా, ఇండస్ట్రియల్ , వ్యవసాయ విద్యుత్ సర్వీసులను కూడా వీలైనంత త్వరగా పునరుద్ధరించి, సాధారణ విద్యుత్ సరఫరా పరిస్థితులను పూర్తిస్థాయిలో తీసుకువస్తామని సూపరింటెండింగ్ ఇంజనీర్ కట్టా.వేంకటేశ్వర్లు తెలియజేసారు.

14 నుండి గ్రంథాలయ వారోత్సవాలు

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

గిద్దలూరు – శాఖా గ్రంథాలయం ఆవరణలో ఈ నెల 14– నుండి 20– వరకు '59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు' నిర్వావహించనున్నట్లు గ్రంథ పాలకురాలు ఎన్ ఎమ్ ప్రసన్నకుమారి తెలిపారు. 14న బాలల దినోత్సవ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమ కారులకు నివాళులు, 17న కవి సమ్మేళనం, 18న ఫోటో ఎగ్జిబిషన్, 19న ఇందిరా గాంధీ జయంతి వేడుకలు, 20న వివిధ పోటీలలో విజేతలైన బాలబాలికలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మెంబర్స్, పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి దౌర్జన్యాలను ఖండించండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వామపక్ష, కాంగ్రెస్ పార్టీల ధర్నా



మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 11:

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తూ మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమి నాయకులు ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చించివేశారని, భౌతిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, దారుణమని విమర్శించారు. ఓటమి భయంతోనే పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని కూటమి ప్రభుత్వంపై నేతలు ఆరోపణలు చేశారు. పోలీసులు, అధికారుల సమక్షంలోనే దాడులు జరిగినా వారు ప్రేక్షకపాత్ర వహించారని మండిపడ్డారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను ఎలాంటి బెదిరింపులు, దౌర్జన్యాలు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి. సోమయ్య, సీపీఐ నాయకులు అందె నారసయ్య, ఎస్.కె. కాసిం, కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. మహబూబ్ వలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మౌలానా అబ్దుల్ కలాం



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

జాతీయ విద్యా దినోత్సవం భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా గిద్దలూరు పురపాలక పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపూ రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశ విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయులని కొనియాడారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాలనే ఆశయంతో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపా దించ డానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి పునాది అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంచి విలువలు కలిగిన పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ ప్రగతి పథం స్వ చ్ఛంద సంస్థ వ్యవస్థా పకులు సయ్యద్ ఫరూఖ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీగిరిలో ఆకాశదీపం ప్రారంభం



ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 11

పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధ వారం సాయంత్రం దీప పూజ నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తల మండలి ప్రతినిధులు శ్రీ గిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు పలువురు భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని శివ కేశవారాధనకు సమ ప్రాధాన్యత కలిగిన గొప్ప మాసమని ఈ మాసంలో చేసే స్నానం దానం ఉపవాసం జపము తపము దీపారాధన విశేష పుణ్యాన్ని కలుగ చేస్తాయని వివరించారు. ఆల యాలలో... ఇంటి ముందు వెలిగించే ఆకాశదీపం పితృ దేవతలకు దారి చూపుతుందని పేర్కొన్నారు. దీపం జ్ఞానానికి ప్రతీక అని హైందవ సంప్రదాయంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉందని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి ప్రణతుల ర్పించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దేశం కోసం సరిహద్దుల్లో పోరు.. గ్రామం కోసం సర్పంచ్ పోరు!

సర్పంచ్ రేసులో ఆర్మీ బుజ్జి.. ప్రత్యర్థుల్లో గుబులు!

గ్రామాభివృద్ధే లక్ష్యంగా మాజీ సైనికుడి అడుగులు..

పుల్లల చెరువు పెన్ పవర్ నవంబర్ 11

స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ పుల్లలచెరువు మండల కేంద్రంలో సర్పంచ్ పదవిని ఆశిస్తున్న ఆశావహులు ఒక్కొక్కరుగా తెరపైకి వస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో గ్రామంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎవరికి వారు తమదైన వ్యూహాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ సరిహద్దుల్లో సైనికుడిగా పనిచేసి దేశ రక్షణలో తన వంతు సేవలందించిన మాజీ సైనికుడు దాసి వెంకటేశ్వర్లు అలియాస్ ఆర్మీ బుజ్జి సర్పంచ్ బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతుండటం మండల కేంద్రంలో హాట్‌టాపిక్‌గా మారింది.దేశం కోసం సరిహద్దుల్లో సేవలందించిన వ్యక్తి ఇప్పుడు సొంత గ్రామ అభివృద్ధి కోసం రాజకీయ బరిలోకి దిగాలని భావిస్తుండటంతో స్థానికంగా ఆసక్తికర చర్చ సాగుతోంది.ఇప్పటివరకు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువైన ఆయన, ఇప్పుడు ప్రత్యక్షంగా గ్రామ పాలనలో భాగస్వామి కావాలని అడుగులు వేస్తుండటంతో రాజకీయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది. ఆర్మీ బుజ్జి పోటీకి దిగితే ఎన్నికల సమీకరణాలు ఎలా మారుతాయి? ఆయనకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుంది? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ఆయన బరిలో ఉంటే తమ ఓటు బ్యాంకుపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన కొందరు ప్రత్యర్థి ఆశావహుల్లో మొదలైందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.





సరిహద్దుల్లో దేశ సేవ.. గ్రామంలో ప్రజాసేవ!

సైనికుడిగా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహించిన దాసి వెంకటేశ్వర్లు, పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామం పుల్లల చెరువుకు చేరుకున్నారు.చాలామంది పదవీ విరమణ తర్వాత వ్యక్తిగత జీవితానికి పరిమితమవుతుండగా, ఆయన మాత్రం గ్రామానికి తన వంతుగా ఏదైనా మంచి చేయాలనే ఆలోచనతో సామాజిక సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేశారు.దేశానికి సేవ చేసిన అనుభవాన్ని గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా మలచుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.ఈ క్రమంలో తన మిత్రులతో కలిసి 'ఫ్రెండ్స్ సర్కిల్' అనే సోషల్ సర్వీస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో రోడ్డు డివైడర్లలో మొక్కలు నాటడం, వాటి ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సమాజంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ యువతలో సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయమే బాటగా..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సరైన చదువుకునే వాతావరణం, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, సమాచార వనరులు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఉద్యమం చేపట్టారు. గ్రామీణ యువత ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల దిశగా ముందుకు సాగాలంటే గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని భావించి ఈ అంశంపై పలువురి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు.అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తూ విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలనే ఆలోచనతో పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాల నిర్మాణమే కాకుండా విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించడం కూడా ముఖ్యమనే భావనతో ముందుకు సాగుతున్నారు.

లిమండల కేంద్రానికి రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి..లి పుల్లల చెరువు మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను గుర్తించిన ఆర్మీ బుజ్జి, మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయత్నించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంప్రదింపులు జరపడంతో బస్సు సౌకర్యం ఏర్పాటు కావడానికి తన వంతు కృషి చేశారు. ఈ సౌకర్యం వల్ల ప్రయాణికులకు ఉపయోగం కలగాలనే ఉద్దేశంతో ఆయన చేసిన ప్రయత్నం స్థానికంగా గుర్తింపు పొందింది.అంతేకాకుండా మండల కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోరు ఏర్పాటు చేయించడంలోనూ, ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణానికి సహకరించడంలోనూ తన వంతు పాత్ర పోషించారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

సామాజిక సేవ నుంచి రాజకీయ సేవ వైపు..

ఇప్పటివరకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆర్మీ బుజ్జి, ఇప్పుడు సర్పంచ్ పదవిపై ఆసక్తి చూపుతుండటంతో ఆయన రాజకీయ ప్రస్థానంపై చర్చ మొదలైంది. గ్రామంలో ఉన్న సమస్యలను దగ్గరగా గమనించడం, ప్రజల అవసరాలను తెలుసుకోవడం, అధికారులతో సంప్రదింపులు జరిపి కొన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అనుభవాలు తనకు ఉన్నాయని ఆయన భావిస్తున్నారు.సర్పంచ్ పదవి అంటే కేవలం రాజకీయ హోదా మాత్రమే కాదని, గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలే తనకు ప్రజల్లో గుర్తింపును తీసుకొచ్చాయని, వాటి ఆధారంగా ప్రజల మద్దతు పొందగలననే ఆశాభావంతో ఆర్మీ బుజ్జి ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.



అవకాశం కల్పిస్తే అభివృద్ధికి పెద్దపీట..

ఈ సందర్భంగా దాసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికుడిగా పనిచేసి దేశ రక్షణలో భాగస్వామ్యం కావడం తన జీవితంలో ఎంతో గర్వకారణమని తెలిపారు. అదే విధంగా తన సొంత గ్రామానికి సేవ చేసే అవకాశం లభిస్తే గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తనను ఆదరించి సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే పుల్లల చెరువు మండల కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ముఖ్యంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, విద్యా సంస్థలకు అవసరమైన సదుపాయాలు, వైద్య సేవల అందుబాటు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపడం, వృద్ధులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం తన లక్ష్యమని పేర్కొన్నారు.గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వ్యక్తిగా ఉంటానని, ప్రజల సూచనలు, సలహాలతో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. పదవి కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే సంకల్పంతోనే ముందుకు వస్తున్నానని, దేశ సేవ చేసిన తనకు గ్రామ సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలను కోరుతున్నారు.

ఆర్మీ బుజ్జి అడుగులతో మారనున్న సమీకరణాలు?

మొత్తానికి సరిహద్దుల్లో దేశ రక్షణ బాధ్యతలు నిర్వహించిన మాజీ సైనికుడు ఇప్పుడు గ్రామ పాలనలో భాగస్వామి కావాలని భావిస్తుండటం పుల్లల చెరువు రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఇప్పటికే సేవా కార్యక్రమాలతో ప్రజల్లో కొంత గుర్తింపు సంపాదించిన ఆయనకు ఎన్నికల్లో ఎలాంటి ఆదరణ లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.ఇతర ఆశావహుల మధ్య ఆయన పోటీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తుందా? యువత, సామాన్య ప్రజలు ఆయన వైపు మొగ్గు చూపుతారా? అన్న చర్చలు సాగుతున్నాయి.దేశ సరిహద్దుల్లో తుపాకీ పట్టి దేశాన్ని కాపాడిన సైనికుడు.. ఇప్పుడు గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆశపడుతున్నాడు. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్మీ బుజ్జి అడుగులు ఎటువైపు పడతాయి? ప్రజల తీర్పు ఎలా ఉండబోతోంది? అన్నది వేచి చూడాల్సిందే!.

ఎరువులు తక్కువ ధరకే అందించడమే లక్ష్యం



పిసిపల్లి , పెన్ పవర్ నవంబర్ 11

రైతులకు ఎరువులను తక్కువ ధరకు అందించడమే లక్ష్యం అని వ్యవసాయశాఖాధికారి ఎన్ రంగా కృష్ణ అన్నారు. బుధవారం మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో ఎరువుల అమ్మకాల విధానంపై నేర్పు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు, ఎరువుల వర్తకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్. రంగకృష్ణ మాట్లాడుతూ, ఎరువుల

వ్యవసాయ అధికారి రంగకృష్ణ

అమ్మకాల వ్యవస్థ మన దేశంలో చట్టబద్ధమైన నిబంధనలు, పారదర్శకత, పంపిణీ నియంత్రణపై ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులను సరసమైన ధరలకు అందించడం, ప్రభుత్వ రాయితీ దుర్వినియోగాన్ని అరికట్టడం, నల్లబజారును నియంత్రించడమే ఈ విధానం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ కొత్త విధానం ద్వారా రైతులు ఎరువులను ఏ విధంగా నమోదు చేసుకోవాలి, ఎరువుల అమ్మకాల కేంద్రంలో ఎలా సంప్రదించాలి అనే విషయాలను చరవాణి ద్వారా వివరించారు. కొత్త విధానం త్వరలో అమల్లోకి వస్తుందని తెలిపారు. అధిక దిగుబడి కోసం రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని, దీని వల్ల ఆహార పదార్థాలు రోజురోజుకు కలుషితమైపోతున్నాయని అన్నారు . ప్రతి ఒక్క రైతు ఈ విధానాన్ని ఉపయోగించాలని వర్తకులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రస్తుతం పంటలపై వస్తున్న పురుగులు, తెగుళ్లు, వాటిని అరికట్టే విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ ఆయేషా, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ఎరువుల వర్తకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు




గిద్దలూరు: పెన్ వర్ నవంబర్ 11

భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఆదం ఆసుపత్రి సిబ్బంది కలిసి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొని ఆయన దేశానికి, విద్యారంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

ఉడా చైర్మన్ రియాజ్ ను కలసిన మద్దుల శ్రీనివాసులు

పొదిలి, పెన్ పవర్, నవంబర్ 11

ఉ డా చైర్మన్ షేక్ రియాజ్ ను పొదిలి మండల జడ్పిటిసి మద్దుల శ్రీనివాసులు కలిశారు. ఆయన ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా రియాజ్ ను బుధవారం నాడు ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. అలాగే శ్రీనివాసులు ముందుగా చైర్మన్ రియాజ్ ను శాలువా, పూలదండతో సత్కరించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. అందుకు స్పందించిన రియాజ్ ఎంతో ఆప్యాయతగా శ్రీనివాసులును పలుకరించి తన కృతజ్ఞతలు తెలియజేశారు.



విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, గిద్దలూరు మెయిన్ బ్రాంచ్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మార్కాపురం ప్రాంతీయ మేనేజర్ వెంకటేశ్వర్లు, గిద్దలూరు మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పి. రామోహన్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదం, మెడికల్ ఆఫీసర్ శ్రీ కె.వి. రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తరఫున ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రోగులకు సేవాభావంతో సహాయం అందిస్తూ బ్యాంకు తన సామాజిక బాధ్యతను చాటుకుంది. అనంతరం ప్రాంతీయ మేనేజర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ పథకాలు, బ్యాంకింగ్ సేవలు , ఖాతాదారులకు అందుబాటులో ఉన్న ప్రయోజనాలను వివరించారు. ప్రజలు బ్యాంకు అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు. ముఖ్యంగా బ్యాంకు ప్రవేశపెట్టిన ఫెస్టివ్ వైబ్ పథకం గురించి వివరిస్తూ, ఈ పథకం కింద అర్హత కలిగిన రుణాలకు ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా రుణాలు మంజూరు చేయబడుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆర్థిక అవగాహన పెంపొందించడంతో పాటు, ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడం, పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవ పట్ల తన నిబద్ధతను చాటుకుంది.

పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా.. నిష్పక్షపాతంగా నిర్వహించాలి

– కూటమి నేతలు, సహకరించిన అధికారులపై కేసులు నమోదు చేయాలి –సిపిఎం – సిపిఐ డిమాండ్

ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ నవంబర్ 11

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ అధికార బలంతో సాగించిన అక్రమాలపై ప్రజలు ఉద్యమించాలని సిపిఎం, సిపిఐ వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ఓటు వేసే హక్కుతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే ప్రాథమిక హక్కును కాపాడుకోవాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడిన కూటమి నాయకులతో పాటు వారికి సహకరించిన ప్రభుత్వ యంత్రాంగంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే పంచాయతీ ఎన్నికలను ఎలాంటి బెదిరింపులు, దాడులు, ప్రలోభాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన అక్రమాలను నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపునిస్తూ బుధవారం సాయంత్రం ఒంగోలులోని సాగర్ హోటల్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ సంయుక్తంగా నిరసన కార్యక్రమం నిర్వహించాయి. సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నామినేషన్లు వేసేందుకు వెళ్లిన అభ్యర్థుల నుంచి పత్రాలు లాక్కోవడం, చించివేయడం, దాడులకు పాల్పడటం, పోటీలో ఉన్నవారిని బెదిరించి ఉపసంహరణకు ఒత్తిడి చేయడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి ఉపసంహరణ గడువు ముగిసే వరకు రక్షణ కల్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



ఎన్నికల నిర్వహణలో పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉండగా అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపించారు. గెలిచిన అభ్యర్థులను సైతం రీకౌంటింగ్ పేరుతో ఓడినట్లు ప్రకటించిన ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోయేలా చేస్తున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్ దశ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రకాశం జిల్లాలోని దర్శి, కనిగిరి, కొండపి, కందుకూరు, జరుగుమల్లి, మర్రిపూడి తదితర ప్రాంతాల్లో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బెదిరించడం, ఉపసంహరణకు ఒత్తిడి చేయడం వంటి ఘటనలు జరిగాయని ఆరోపించారు. కొమరోలు లో సిపిఎం నాయకులు ఆవులయ్య పై దాడి చేసారని,కనిగిరిలో సిపిఎం నాయకులు కేశవరావు తో పాటు కార్యకర్తలను అడ్డుకోవడంతో పాటు కేసులు, రౌడీషీట్ల పేరుతో భయపెట్టారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి మతతత్వాన్ని జోడించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం కూడా ప్రమాదకరమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాకుండా ప్రజల విశ్వాసం పొందేందుకు పాలన సాగించాలని ప్రభుత్వానికి హితవు పలికారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఘర్షణలు, కక్షలు పెరగకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, పోలీసు యంత్రాంగం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని వామపక్ష నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి,సిపిఐ జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు చీకటి శ్రీనివాసరావు, శ్రీరామ్ శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బి రఘురాం, వి బాలకోటయ్య, పి కల్పన, నగర నాయకులు జి రమేష్, కె ఎఫ్ బాబు, సయ్యద్ హుస్సేన్, తంబి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, ఎన్ వీరాస్వామి,టి భక్త సింగ్ రాజు, సిహెచ్ వినోద్, సిహెచ్ శేషయ్య, బివి రావు సిపిఐ నాయకులు, ఎస్టి సర్దార్, చంద్ర, పోలేరయ్య, సాలార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర డీజీపీకి ఘన స్వాగతం

భోగాపురం విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేసిన విజయనగరం జిల్లా ఎస్పీ



విజయనగరం, పెన్ పవర్ నవంబర్ 12

విశాఖపట్నంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న ప్రతిష్ఠాత్మక సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ విజయనగరం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా నవంబర్ 11న భోగాపురంలోని ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా డీజీపీని కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి రాష్ట్ర డీజీపీకి సాదర స్వాగతం పలికారు. సీఐఐ సదస్సు నేపథ్యంలో విశాఖపట్నంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు డీజీపీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

కొలుసు పార్థసారథి విశాఖ పర్యటన

12, 13 తేదీల్లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొననున్న మంత్రి



విశాఖపట్నం, పెన్ పవర్ నవంబర్ 12

రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం రాత్రి 7 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖపట్నం చేరుకోనున్న మంత్రి, నగరంలోని ఓ హోటల్‌లో బస చేస్తారు. అనంతరం నవంబర్ 12వ తేదీ ఉదయం 9.50 గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 10 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ మైదానానికి చేరుకుంటారు. అక్కడ నిర్వహించనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం తిరిగి హోటల్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. నవంబర్ 13వ తేదీ ఉదయం 9.50 గంటలకు హోటల్ నుంచి బయలుదేరి 10 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ మైదానానికి చేరుకుని సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొంటారు.

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలి

మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి



పొదిలి, పెన్ పవర్, నవంబర్ 11

రైతులు ఆధునిక సస్యరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. బుధవారం నాడు మండలంలోని సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి, రైతులకు సస్యరక్షణ పద్ధతుల గురించి అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే రైతులు వ్యవసాయపరంగా అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ శ్రీలేఖతోపాటు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో తూనికల కొలతల శాఖ ఆకస్మిక అధికారుల తనిఖీలు

ఏడు దుకాణాలపై కేసులు నమోదు..

రూ.20 వేల జరిమానా



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

గిద్దలూరు, లో తూనికల కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణా దుకాణాల్లో బియ్యం విక్రయాలపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. బియ్యం విక్రయాల్లో తూకాల్లో తేడాలు, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా కంభంలో మూడు , బెస్తవారిపేటలో రెండు, గిద్దలూరులో రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశామనితెలిపారు. మొత్తం ఏడు దుకాణాలపై కేసులు నమోదు చేసి సుమారు రూ.20 వేల వరకు జరిమానా విధించినట్లు తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జావీద్ తెలిపారు. వినియోగదారులను మోసం చేస్తూ తూకాల్లో తేడాలు చూపించినా, బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించినా ఉపేక్షించేది లేదని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ జావీద్ స్పష్టంచేశారు.

సర్పంచ్ ఎన్నికలకు టీడీపీ శ్రేణులను సమాయత్తం చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

రాచర్ల మండల నాయకులతో కీలక సమీక్ష

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 12

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచర్ల మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే విస్తృతంగా సమీక్షించి, మండలంలోని గ్రామాల వారీగా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. రాబోయే సర్పంచ్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని



సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో పార్టీకి మరింత బలాన్ని చేకూర్చాలని పిలుపునిచ్చారు.

మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఘన నివాళులు




దొనకొండ నవంబర్ 11 పెన్ పవర్

మండలంలోని పోలేపల్లి ప్రాథమిక ఆదర్శ పాఠశాల నందు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా బుధవారం జాతీయ విద్య దినోత్సవం పురస్కరించుకొని పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాస్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు . ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మౌలానా ఆజాద్ స్వతంత్ర సమరయోధుడిగా స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు ఆయన దేశభక్తి విద్యారంగానికి చేసిన సేవలు జాతీయ సమైక్యత కోసం చూపిన చిత్తశుద్ధి నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు యుద్ధ లేకుండా ఏ దేశం అభివృద్ధి చెందదనే నమ్మిన ఆజాద్ దేశంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారని ఆయన గుర్తుచేశారు ఆయన ఆశయాలను నేటి యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు.ప్రభుదాసు విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచడమైనది.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పావని ఎం ఆశాజ్యోతి వై వెంకటమ్మ పాల్గొన్నారు. పాఠశాల సిబ్బంది పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అక్రమాలపై నిరసన

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర వామపక్ష పార్టీల రాష్ట్ర వ్యాప్తి పిలుపులో భాగంగా బుధవారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర ఇటీవల జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ , మున్సిపల్ ఎన్నికల అక్రమాలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి నరసింహులు, డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర వ్యాప్తి ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మునిసిపల్ ఎన్నికలలో అధికార కూటమి అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడిందని వామపక్ష పార్టీల కార్యకర్తల పై దాడి, గృహనిర్బంధం, బెదిరింపులకు దిగిందని దీనికి నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపుమేరకు నిరసన తెలియజేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపలేదని అన్నారు. జరగబోవు స్థానిక



సంస్థల గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలన్నారు. నిరసన కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు ఎన్ వీరయ్య, పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి శిద్దా



ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 11

తాళ్లూరు మండలం వెలుగు వారి పాలెం లో జరిగిన వెలుగు సుబ్బారావు అన్న కుమారుడు రామాంజనేయులు, వెంకట శ్రావణి వివాహానికి హాజరైన రాష్ట్ర మాజీ మంత్రి డా.శిద్దా రాఘవ రావు నూతన దంపతులను ఆశీర్వదించి.. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవ రావుని కుటుంబ సభ్యులతో కలసి వెలుగు సుబ్బారావు శాలువాతో ఘనంగా సత్కరించారు.

పాతగాజువాకలో కత్తితో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నర్సింగరావు ఏ చిరంజీవిపై ఛాతీపై కత్తితో దాడి చేసి పరారైన నాగరాజు

విశాఖపట్నం, పెన్ పవర్ నవంబర్ 12



గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతగాజువాకలో కత్తితో దాడి ఘటన కలకలం రేపింది. నర్సింగరావు అలియాస్ చిరంజీవి అనే వ్యక్తిపై నాగరాజు అనే వ్యక్తి కత్తితో దాడి చేసి పరారయ్యాడు.

వాగ్వాదమే దాడికి కారణమా?

బాధితుడు నర్సింగరావు నాయనమ్మ పెద్దకర్మ కార్యక్రమానికి నాగరాజు వచ్చాడు. నాగరాజు బాధితుడికి మేనత్త రెండో భర్తగా తెలుస్తోంది. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం.

విజయవాడ వెళ్లే సమయంలో దాడి

సాయంత్రం పాతగాజువాకలో నర్సింగరావు విజయవాడ వెళ్లేందుకు వెళ్తున్న సమయంలో నాగరాజు ఎదురుపడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ చోటుచేసుకోగా, నాగరాజు కత్తితో నర్సింగరావు ఛాతీపై దాడి చేసి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.

కేసు నమోదు చేసిన పోలీసులు

దాడిలో గాయపడిన నర్సింగరావును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నాగరాజు ఆచూకీ కోసం పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

పురుష క్రికెటర్లతో సమానంగా మమ్మల్నీ గుర్తించండి: పాక్ కెప్టెన్ ఫాతిమా సనా

- పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కు ఆదరణ దక్కాలన్న ఫాతిమా సనా
- డబ్ల్యూబీబీఎల్‌లో పెర్త్ స్కార్చర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సనా
- ఈ లీగ్‌లో ఆడుతున్న రెండో పాకిస్థాన్ మహిళా క్రికెటర్
- 2028 టీ20 వరల్డ్ కప్‌తో పెను మార్పులు ఖాయమన్న ఆశాభావం
- మెగా టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న పాక్



పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్‌కు కూడా గుర్తింపు, ఆదరణ దక్కాలని ఆ దేశ మహిళల జట్టు కెప్టెన్ ఫాతిమా సనా ఆకాంక్షను వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరుగుతున్న ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫాతిమా సనా మాట్లాడుతూ, మహిళల క్రికెట్‌లో సమగ్ర మార్పు రావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. పాకిస్థాన్‌లో పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు స్టేడియాలు కిక్కిరిసిపోవడం, మీడియా నుంచి విపరీతమైన ప్రచారం లభించడం సర్వసాధారణమని, సరిగ్గా అలాంటి వాతావరణం, ఉత్సాహం మహిళల మ్యాచ్‌లకు కూడా దక్కాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ఫాతిమా సనా పేర్కొంది. మైదానంలో మహిళా క్రికెటర్లు సైతం పూర్తి స్థాయిలో శ్రమిస్తున్నారని, వారికి కూడా సమాన స్థాయిలో అభిమానుల మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడింది. ఈ ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం 15 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం సాధించి ప్రపంచ రికార్డు సృష్టించిన ఫాతిమా సనా, మహిళల బిగ్ బాష్ లీగ్‌లో అడుగుపెట్టిన రెండో పాకిస్థానీ క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో 2019లో నిదా దార్ ఈ లీగ్‌లో ఆడగా, మళ్లీ ఇన్నాళ్లకు ఫాతిమాకు ఈ అవకాశం లభించింది. డబ్ల్యూబీబీఎల్ వంటి నాణ్యమైన అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని, తన అనుభవం భవిష్యత్తులో మరింత మంది పాకిస్థానీ అమ్మాయిలు విదేశీ లీగ్‌లకు ఎంపికయ్యేందుకు మార్గం సుగమం చేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. మరోవైపు, 2028లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనుండటంపై ఫాతిమా సనా స్పందిస్తూ.. ఈ మెగా ఈవెంట్ దేశంలో మహిళల క్రీడారంగానికి ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పింది. సొంత గడ్డపై ప్రపంచకప్ నిర్వహించడం ద్వారా స్థానిక బాలికల్లో క్రికెట్ పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని, మహిళల క్రికెట్‌ను చూసే దృక్పథంలోనూ స్పష్టమైన మార్పు వస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేసింది. క్రీడారంగంలో లింగ సమానత్వం దిశగా అడుగులు పడటానికి ఇలాంటి భారీ టోర్నీలు దోహదపడతాయని ఫాతిమా సనా స్పష్టం చేసింది.

'శ్రేయస్.. నీ వెనక నేనున్నా'.. పంజాబ్‌కు మారిన తర్వాత హార్దిక్ ఫస్ట్ రియాక్షన్

ఐపీఎల్‌లో కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ వ్యవహారం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారనున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బలమైన సందేశం పంపించాడు. కెప్టెన్ శ్రేయస్, కోచ్ రికీ పాంటింగ్ సహా పంజాబ్ జట్టు మొత్తానికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశాడు. పంజాబ్ జెర్సీతో ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు.రెండుసార్లు ఐపీఎల్ ఫైనల్‌కు చేరిన పంజాబ్ కింగ్స్‌తో కలిసి పనిచేయడం పట్ల హార్దిక్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. పంజాబ్ మొత్తం.. మీ వెనక నేనున్నా' అంటూ పోస్ట్ చేశాడు. తన ఆల్‌రౌండ్ నైపుణ్యాలతో జట్టుకు ఉపయోగపడతాననే సంకేతాలిచ్చాడు.ఐపీఎల్ చరిత్రలోనే కీలకమైన ఆటగాళ్ల మార్పిడిలో భాగంగా పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ వెళ్లనున్నాడు. అతడి స్థానంలో భారత టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌లో చేరనున్నాడు. ఈ ట్రేడింగ్‌లో హార్దిక్ పారితోషికం రూ.16.35 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెరగనుంది. అర్ష్‌దీప్ మాత్రం తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టుకు మారనున్నాడు.



హార్దిక్‌కు ముంబై ఇండియన్స్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2015లో ఆ జట్టులో చేరిన అతడు 2015, 2017, 2019, 2020 సీజన్లలో టైటిళ్లు గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల తర్వాత గుజరాత్ టైటాన్స్‌కు మారి, తొలి సీజన్‌లోనే కెప్టెన్‌గా టైటిల్ అందించాడు. 2023లోనూ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. 2024లో తిరిగి ముంబైకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు.మొత్తం 162 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో హార్దిక్ 2,955 పరుగులు చేయడంతోపాటు 82 వికెట్లు పడగొట్టాడు. అయితే ముంబైతో రెండో విడత మూడేళ్ల ప్రయాణంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. 39 మ్యాచ్‌ల్లో 647 పరుగులు, 29 వికెట్లు సాధించాడు. అతడి కెప్టెన్సీలో ముంబై 2025లో ప్లేఆఫ్స్‌కు చేరగా, 2024, 2026 సీజన్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది.మరోవైపు అర్ష్‌దీప్ 2019లో పంజాబ్ తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఆ జట్టు తరఫున 96 మ్యాచ్‌ల్లో 111 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. 2025 సీజన్‌లో 21 వికెట్లు, 2026లో 14 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతోపాటు డెత్ ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

హార్దిక్ పాండ్యాకు థ్యాంక్స్ చెప్పిన ముంబై.. ఎమోషనల్ వీడియోతో వీడ్కోలు!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో మరో సంచలన ట్రేడ్ చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ (ఎంఐ) కెప్టెన్ హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) జట్టుకు బదిలీ చేశారు. ఈ భారీ ఒప్పందంలో భాగంగా పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. హార్దిక్ కెప్టెన్సీలో ముంబై ప్రదర్శన నిరాశపరచడంతో ఫ్రాంచైజీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీతో ముంబై ఇండియన్స్‌తో హార్దిక్ రెండో ఇన్నింగ్స్‌కు తెరపడినట్లయింది.ఈ సందర్భంగా హార్దిక్ పాండ్యాకు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ భావోద్వేగంగా వీడ్కోలు పలికింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ప్రత్యేక పోస్టులు పెట్టింది. "జట్టు కోసం ఎంతో ఇష్టంతో, గర్వంతో ఆడిన హార్దిక్‌కు ధన్యవాదాలు. నీ భవిష్యత్ ప్రయాణం విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఒక పోస్టులో పేర్కొంది. మరో పోస్టులో జట్టు కష్టసుఖాల్లో భాగమైనందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ఎమోషనల్ వీడియోను పంచుకుంది.2015లో తొలిసారి ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన హార్దిక్, ఆ జట్టు నాలుగుసార్లు (2015, 2017, 2019, 2020) టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాట్, బంతితో అద్భుత ప్రదర్శన చేసి స్టార్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. అయితే, గుజరాత్ టైటాన్స్ జట్టుకు రెండేళ్లు ఆడి, మళ్లీ 2024లో ముంబైకి తిరిగి వచ్చాడు. రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు.కానీ, కెప్టెన్‌గా హార్దిక్ రెండో ప్రయాణం ఆశించినంత విజయవంతం కాలేదు. గత మూడు సీజన్లలో రెండుసార్లు ముంబై జట్టు ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ కాలంలో వ్యక్తిగతంగానూ హార్దిక్ రాణించలేకపోయాడు. అతను కేవలం 647 పరుగులు చేసి, 35 వికెట్లు మాత్రమే తీశాడు. ఈ పేలవ ప్రదర్శన కారణంగానే ఫ్రాంచైజీ అతడిని వదులుకోవాలని నిర్ణయించుకుంది.ఈ ట్రేడ్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్ హార్దిక్‌ను రూ.18 కోట్లకు దక్కించుకుంది. గత సీజన్‌లో అతని జీతం రూ.16.35 కోట్లు కాగా, ఇప్పుడు మరింత పెరిగింది. తన ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు 162 మ్యాచ్‌లు ఆడిన హార్దిక్, 146.28 స్ట్రైక్ రేట్‌తో 2,955 పరుగులు చేసి, 82 వికెట్లు పడగొట్టాడు. ముంబైతో సుదీర్ఘ అనుబంధం ముగించుకుని, హార్దిక్ ఇప్పుడు పంజాబ్ కింగ్స్ తరఫున కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నాడు.

వైట్ క్రాప్ టాప్‌లో గ్లామర్ ట్రీట్ ఇచ్చిన దిశా పటానీ!

బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ సోషల్ మీడియాలో అడుగుపెడితే చాలు.. ఇంటర్నెట్ షేక్ అవ్వాల్సిందే. ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫోటోషూట్లతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేసే ఈ బ్యూటీ, తాజాగా ఆల్-వైట్ ఇండో-వెస్ట్రన్ ఫ్యూజన్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయింది. ఒకవైపు ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే, మరోవైపు తన మార్క్ గ్లామర్‌తో ఫ్యాన్స్‌కి అదిరిపోయే విజువల్ ట్రీట్ ఇచ్చింది. ఆ ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

ఆల్-వైట్ డ్రెస్‌లో అద్భుతమైన లుక్:

ఈ ఫోటోషూట్‌లో దిశా పటానీ వేసుకున్న వైట్ డ్రెస్ చాలా స్పెషల్‌గా ఉంది. సిల్వర్ వర్క్ చేసిన వైట్ క్రాప్ టాప్, దానికి మ్యాచింగ్‌గా ఫ్లోర్-లెంగ్త్ స్కర్ట్ ధరించింది. దీనిపైకి వేసుకున్న పొడవాటి నెట్ జాకెట్, చేతులకు ఉన్న ఎంబ్రాయిడరీ డిజైన్ ఆమె లుక్‌కి మరింత గ్రేస్ తీసుకొచ్చాయి. లైట్‌గా వేవ్స్‌లా వదిలేసిన జుట్టు, పింక్ ఇయర్ రింగ్స్‌తో దిశా పటానీ అచ్చం ఏంజెల్‌లా మెరిసిపోతోంది.

తెరపై హాట్.. బయట మాత్రం చాలా సిగ్గరి:

సినిమాల్లో బోల్డ్ క్యారెక్టర్లు, అదిరిపోయే డ్యాన్స్ స్టెప్పులతో దిశా రచ్చ చేస్తుంటుంది. కెమెరా ఆన్ అయితే చాలు తనలోని గ్లామర్ యాంగిల్ బయటకు వస్తుంది. కానీ రియల్ లైఫ్‌లో తను చాలా సిగ్గరి అని దిశానే స్వయంగా చాలాసార్లు చెప్పింది. ఇక పబ్లిక్ ఈవెంట్స్‌లో నలుగురి ముందు మాట్లాడాలంటే ఇప్పటికీ తనకు కొంచెం మొహమాటం అని ఆమె గతం లో తెలిపారు.

టైగర్ ష్రాఫ్ ఇంటి వద్ద దిశా సందడి!:

ఇక పర్సనల్ విషయాలకు వస్తే.. రీసెంట్‌గా హీరో టైగర్ ష్రాఫ్‌పై దాడి జరిగిన కొన్ని గంటల్లోనే దిశా ఆయన ఇంటికి వెళ్లింది. వైట్ టాప్, బ్లూ జీన్స్ వేసుకుని, చేతిలో ఒక కేర్ ప్యాకేజీ పట్టుకుని టైగర్ ఇంటికి వెళ్తున్న వీడియో బయటకు రావడంతో, వీళ్లిద్దరి మధ్య ఉన్న బాండింగ్‌పై మళ్లీ చర్చ మొదలైంది.

ఓటీటీలోనూ దుమ్మురేపుతున్న బ్లాక్‌బస్టర్:

ఇక మరోవైపు కెరీర్ పరంగానూ దిశా ఫుల్ ఫామ్‌లో ఉంది. ఇమ్రాన్ హష్మీతో కలిసి ఆమె నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ దగ్గర 200 కోట్లకు పైగా వసూలు చేసి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇటీవల అమెజాన్ ప్రైమ్ వీడియోలో రిలీజైన ఈ సినిమా, ఎలాంటి అంచనాలు లేకుండానే మొదటి రోజు నుంచే నంబర్ 1 స్థానంలో ట్రెండ్ అవుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది.ఇక మొత్తానికి ఒకవైపు 200 కోట్ల బ్లాక్‌బస్టర్ సినిమాతో, మరోవైపు ఈ వైట్ డ్రెస్ ఫోటోషూట్‌తో దిశా పటానీ వార్తల్లో నిలుస్తోంది. గ్లామర్ విషయంలో తనకు తిరుగులేదని మరోసారి ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ, రాబోయే 'ఆవారాపన్ 2' సినిమాతో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com